క్లుప్తంగా

పాఠశాల ప్రారంభం



పాఠశాల ఆవరణలో చెట్లను నాటుతున్న కార్నివలి ఫౌండేషన్ చైర్మన్ జాకీ

జగద్గిరిగుట్ట: గాజులరామారం డివిజన్ లెనిన్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాల మంగళవారం ప్రారంభమైంది. కార్నివలి ఫౌండేషన్ సహకారంతో అదనపు గదులు, టాయిలెట్లు, ఆర్‌ఓ ప్లాంట్, వంటశాల తదితర నిర్మాణాలు పూర్తయ్యాయి. ఫౌండేషన్ చైర్మన్ జాకీ ముఖ్యఅతిథిగా హాజరై వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల ఆవరణలో చెట్లను నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

అన్నదానం



పేట్‌బషీరాబాద్ కట్టమైసమ్మ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

జీడిమెట్ల: డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని శ్రీకట్ట మైసమ్మ ఆలయం వద్ద మంగళవారం మైసమ్మ గూడకు చెందిన నరసింహారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ త్రిషూల్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అంతకుముందు అమ్మవారికి అభిషేకం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వివేక్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదానం చేశారు. ప్రతి మంగళవారం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని, భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ చైర్మన్ కోరారు.

జాబ్ మేళా



జాబ్ మేళాలో పాల్గొన్న యువత

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ కమ్యూనిటీహాల్‌లో మంగళవారం తుమ్మ నవీన్ ఆధ్వర్యంలో క్యామియో కార్పొరేట్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ జాబ్ మేళా నిర్వహించింది. జాబ్ మేళాను వార్డు సభ్యుడు అబ్దుల్ ఖాదర్ ప్రారంభించగా 300 మంది యువతీ యువకులు మేళాకు హాజరయ్యారు. 7 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తూ ఆఫర్ లెటర్లు అందజేశారు. వెంకట్‌రాంరెడ్డి నగర్ వెల్ఫేర్ ప్రెసిడెంట్ సతీష్ గట్టోజి, విజయ్ నగర్‌కాలనీ వెల్ఫేర్ వైస్ ప్రెసిడెంట్ బాలు నేత, రహీం, నాగరాజ్ మన్సూర్, అల్లావుద్దీన్, రమ్మి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయండి.. సమస్య తీర్చండి



రింగ్ బస్తీలోని రోడ్డు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని రింగ్‌బస్తీలో డ్రైనేజీ పనుల కోసం రోడ్డు తవ్వి వదిలేయడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ పనులు పూర్తయినా రోడ్డును మాత్రం ఇప్పటి వరకు వేయలేదు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రింగ్‌బస్తీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు నడవడానికి కుస్తీ పడాల్సి వస్తోంది. వీలైనంత తొందరగా రోడ్డు పనులను పూర్తి చేసి తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై కార్పొరేటర్ జగన్‌ను వివరణ కోరగా రూ.95లక్షలతో ఈ రోడ్డు త్వరలోనే ప్రారంభం కానుందని తెలిపారు.

పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్లాట్లు ఇస్తే..

- ఇప్పటికే బహుళ అంతస్తుల కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు

కమర్షియల్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్న పారిశ్రామికవేత్తలు

రంగారెడ్డినగర్: సీఐఈ గాంధీనగర్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలో ఉన్న గాంధీనగర్ పారిశ్రామిక వాడ సీఐఈ పరిధిలో పరిశ్రమలు నెలకొల్పేందుకు పలువురు పారిశ్రామికవేత్తలకు ప్లాట్లు కేటాయించారు. అయితే కొందరు నిబంధనల్లోని లోసుగులను ఆసరాగా చేసుకుని ప్లాట్ల కమర్షియల్‌గా మార్చుకుని విక్రయించడంతో పాటు సదరు ప్లాట్లలో కమర్షియల్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నారు. దీంతో ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఇచ్చిన స్థలాలను కొందరు ఇలా దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐడీపీఎల్ - జగద్గిరిగుట్ట రోడ్డులోని రంగారెడ్డినగర్ ప్రధాన రహదారిని ఆనుకుని ఇలా ఇప్పటికే పలు స్థలాల్లో బహుళ అంతస్తుల కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించడం శోచనీయం.

సెల్లార్ గుంతను పూడ్చకుండా నాలుగు అంతస్తులు...

గాంధీనగర్ పారిశ్రామికవాడ రంగారెడ్డినగర్ పరిధిలోని శివాజీ విగ్రహం సమీపంలోని గతంలో ఉన్న భవనాన్ని కూల్చివేసి కొత్తగా నాలుగు అంతస్తుల భవన నిర్మాణం చేపట్టారు. అయితే గతంలో సెల్లార్‌లో గుంత ఉండేది. కాగా కొత్తగా జీహెచ్‌ఎంసీ నుండి తీసుకున్న అనుమతులు ప్రకారం సెల్లార్ గుంతను పూడ్చి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. కాని సదరు నిర్మాణదారుడు ఇవేమి తనకు వర్తింపవన్నట్లుగా పరదా చాటును పనులు కొనసాగిస్తున్నాడు. సదరు భవనానికి బ్యాంక్ నుండి రుణం సైతం పొందారు. జీహెచ్‌ఎంసీ నిబంధనలకు తూట్లు పొడిచి నిర్మాణం కొనసాగిస్తున్న సదరు నిర్మాణదారుడికి బ్యాంక్ రుణం ఎలా ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ఓ పారిశ్రామికవేత్త అన్నీ తానై వ్యవహరిస్తున్నారు.



గాంధీనగర్ సీఐఈ పరిధిలో ప్లాట్ నం.35లో అనుమతులు లేకుండా షెడ్డు నిర్మాణం



సెల్లార్ ప్రాంతాన్ని పూడ్చని వైనం



ఐడీపీఎల్-జగద్గిరిగుట్ట రోడ్డులోని రంగారెడ్డినగర్ శివాజీ విగ్రహం సమీపంలో సెల్లార్‌తో కొనసాగుతున్న భవన నిర్మాణం

అనుమతులు లేకుండా షెడ్డు నిర్మాణం..

గాంధీనగర్ పారిశ్రామికవాడలోని సంజయ్‌గాంధీనగర్- గాంధీనగర్‌కు వెళ్లే రోడ్డులో ప్లాట్ నెంబరు 35లో ఓ వ్యక్తి గతంలో పాత షెడ్డును కూల్చి కొత్తగా నిర్మాణానికి తెర లేపాడు. అయితే అతను సమర్పించిన ధ్రువ పత్రాలు సరిగా లేవని సీఐఏ గాంధీనగర్ అధికారులు అడ్డు చెప్పారు. రాజకీయ పలుకుబడి ఉన్న సదరు నిర్మాణదారుడు తనకు రాష్ట్ర మంత్రులతో సన్నిహిత సంబంధాలున్నాయని పేర్కొంటూ అధికారులపైనే బెదిరింపులకు పాల్పడుతూ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారు. అధికార పార్టీకి మంత్రుల పేర్లు చెప్పడంతో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారు. ఇలా అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

నోటీసులు జారీ చేస్తాం: ఐలా కమిషనర్

ఈ విషయమై ఐలా కమిషనర్ విజయను సాక్షి వివరణ కోరగా అక్రమ నిర్మాణదారులను గుర్తించి నోటీసులు జారీ చేస్తామన్నారు. భవిష్యత్‌లో నిర్మాణాలు చేపట్టకుండా కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

చీరల పంపిణీకి సమన్వయంతో పనిచేయాలి



దుండిగల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం నుంచి అన్ని వార్డు కార్యాలయాల్లో బతుకమ్మ చీరల పంపిణీ ఉంటుందన్నారు. ఉదయం 8 గంటలకు ఆయా వార్డు కార్యాలయాల వద్దకు సిబ్బంది, అధికారులు చేరుకుని చీరల పంపణీ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మేనేజర్ నరసింహులు, ఆర్‌ఓ సునంద, మున్సిపల్ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్, వార్డు అధికారులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రూ.1.62లక్షలకు ఉషోదయకాలనీ-1 లడ్డూ



కుత్బుల్లాపూర్: ఉషోదయ కాలనీ-1లో గణపతి నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు సురేంద్ర నాథ్‌రెడ్డి రూ.1.62 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు అతడిని సత్కరించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.

‘నో పేమెంట్.. నో వర్క్’



సర్కిల్ కార్యాలయం ముఖద్వారం వద్ద ఆందోళనకు దిగిన కాంట్రాక్టర్లు

కుత్బుల్లాపూర్: పెండింగ్‌లో ఉన్న డబ్బులు ఇచ్చేంత వరకు పనులు చేయమని కాంట్రాక్టర్లు ఆందోళనకు దిగారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో మొత్తం సుమారు 150 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు అట్టి డబ్బులను ఇవ్వకపోగా తాజాగా వచ్చిన పనులను చేయాలని ఒత్తిడి చేయడంతో కాంట్రాక్టర్లు ‘నో పేమెంట్- నో వర్క్’అన్నా నినాదంతో ఆందోళన బాట పట్టారు. అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్, కోశాధికారి అశోక్ ఆధ్వర్యంలో జంట సర్కిల్ కాంట్రాక్టర్లు మంగళవానం ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేసి తమకు బిల్లులు చెల్లించండి.! పనులు చేస్తాం.!! అంటూ నినాదాలు చేశారు. 2022 నుంచి ఇప్పటి వరకు కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. బిల్లులు ఇవ్వమంటే అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. డబ్బులు లేవని తెలిసి కూడా తమతో పనులు చేయించడం ఏమిటని ప్రశ్నించారు. బయట అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేపడితే వాటికి వడ్డీలు కట్టలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించాలని, లేనిపక్షంలో ఎట్టి పరిస్థితుల్లో పనులు చేయమని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: 33 కేవీ లైన్ స్ట్రింగింగ్ పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని మేడ్చల్ ఏడీఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ దూలపల్లి పరిధిలోని రిలయన్స్ స్మార్ట్ సమీపంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు..

- కండ్లకోయ లైన్ షిఫ్టింగ్ పనుల నేపథ్యంలో ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎమరాల్డ్ హైట్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్: బాచుపల్లి నందనవనం కాలనీలో అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్న ఎమరాల్డ్ హైట్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ మాట్లాడుతూ బాచుపల్లి సర్వే నెంబరు 492లోని నందన వనం కాలనీలో ఎమరాల్డ్ హైట్స్‌లో అక్రమంగా సెల్లార్ నిర్మాణం చేపడుతున్నారని, అక్యూపెన్సీ పర్మిషన్ లేకుండానే డ్రైనేజీ లైన్, తాగునీటి పైపులైన్లను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. హెచ్‌ఎండీఏ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న భవన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా సెల్లారు నిర్మాణం జరుగుతున్న సహకరించిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారంలోపు ఎమరాల్ హైట్స్ ప్రాజెక్టుపై చట్టరీత్యా చర్యలు తీసుకోకుంటే మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బీజేపీ పార్లమెంట్ కోకన్వీనర్ డాక్టర్ రాజు, జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ చంద్రమౌళి, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రామచంద్రనాయక్, కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి బిక్షపతి యాదవ్, సెక్రటరీ సుధాకర్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు సాయి రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి ,ట్రేడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కుమార్ గౌడ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



నిజాంపేట్ కార్పొరేషన్ ఎదుట ఆందోళనకు దిగిన బీజేపీ నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం



ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజును కలిసిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. మంగళవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం వినతి పత్రాలు అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే పరమావధిగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అభివృద్ధికే పెద్దపీట వేస్తున్నాం



బాచుపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ నీలారెడ్డి

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో మంగళవారం ప్రగతియాత్ర నిర్వహించిన ఎమ్మెల్యే మేయర్ నీలారెడ్డితో కలిసి 17, 19, 20 డివిజన్లలో రూ.5.93 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 60 ఏళ్లుగా జరుగని అభివృద్ధి పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసి చూపిందన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు మీదనే పార్కింగ్

ట్రాఫిక్ చిక్కుల్లో వాహనదారులు

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ సమీపంలోని కాంటన్ పార్కు నుంచి అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వరకు ఇటీవల జాతీయ రహదారి అధికారులు సర్వీస్ రోడ్డును నిర్మించి ఇరువైపులా డివైడర్లు ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉంది. చుట్టుపక్కల షాపింగ్ మాల్స్, ఆస్పత్రులు, వివిధ వ్యాపార సంబంధిత భవనాలు ఉండడంతో రోడ్డు మీదనే వాహనాలు పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. దీంతో అటు ఇటుగా వచ్చే వాహనదారులు ట్రాఫిక్ చిక్కుల్లో పడుతున్నారు. ఎదురుగా ఏదైనా వాహనం వస్తే ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇక్కడ రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయకుండా కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయంపై అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావును ‘సాక్షి’వివరణ కోరగా తప్పకుండా ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి అక్కడ వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సర్వీసు రోడ్డులో నిలిపిన వాహనాలు

జిల్లాలో ఐదు నియోజకవర్గాలు మావే..

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శంభీపూర్‌రాజు



కుత్బుల్లాపూర్: మేడ్చల్ జిల్లాలో ఉన్న ఐదు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధించి తీరుతుందని.. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే అజెండాగా ముందుకు సాగుతామని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఇప్పటికే జిల్లాల వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు చేపడుతూ వస్తున్న ఎమ్మెల్సీ రాజు ‘సాక్షి’తో మాట్లాడారు.

మూడోసారి సీఎంగా కేసీఆర్..

- రాష్ట్రంలో జరుగుతున్న అభివద్ధి కార్యక్రమాలే తమ గెలుపునకు దోహదపడతాయని అన్నారు. తప్పకుండా ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రమాణస్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లాలో ఉన్న ఉప్పల్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి అసెంబ్లీ నియోజకవర్గాలు తిరిగి బీఆర్‌ఎస్ పార్టీ గెలుస్తుందన్నారు. ఇప్పటికే నిర్వహించిన సర్వేలు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. అయినప్పటికీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మల్కాజిగిరిలో మర్రి రాజశేఖర్‌రెడ్డి గెలుపు ఖాయం..

- ప్రజల మౌలిక వసతులకు పెద్దపీట వేస్తూ ఆయా నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయల పనులు పూర్తి చేశామన్నారు. అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ నాయకులు అధికారంలోకి వస్తే కరెంటు కష్టాలు, మత విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుతారని గుర్తు చేశారు. మల్కాజ్‌గిరిలో మైనంపల్లి హనుమంతరావు పార్టీని వీడినప్పటికీ అక్కడ ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీని ఆదరిస్తున్నారని తెలిపారు. అక్కడ తప్పకుండా తమ పార్టీ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఘన విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

డీఎంఓ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

నిజాంపేట్: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఐటీయుసీ కౌన్సిల్ సభ్యుడు పాల బిందెల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నిజాంపేట్ వార్డు కార్యాలయం వద్ద కార్మికులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ... అసెంబ్లీ సాక్షిగా కాంట్రాక్ట్ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని సీఎం కేసీఆర్ మాట తప్పారని, జీతాలు సైతం తక్కువగా ఉండటంతో పాటు సమయానికి ఇవ్వడం లేదని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఈనెల 7న కార్మికుల సమస్యల పరిష్కారానికి డీఎంఓ కార్యాలయాన్ని ముట్టడించనున్నామని పేర్కొన్నారు. కార్మిక నాయకులు యాదయ్య, దుర్గయ్య, బాబు, భాగ్యమ్మ, నర్సమ్మ, యాదమ్మ, సతమ్మ, నాగమ్మ, లక్ష్మి, కౌసల్య, అమృత, కృష్ణ తదితరలు పాల్గొన్నారు.



నిజాంపేట్ వార్డు కార్యాలయం వద్ద సమావేశమైన మున్సిపల్ కార్మికులు

ఈ బస్తీ దవాఖానాకు విశేష స్పందన





అఖిల్, డాక్టర్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలోని బస్తీ దవాఖానాకు విశేష స్పందన వస్తోంది. ఇక్కడికి వచ్చిన రోగులను ఎలా ట్రీట్ చేస్తారు? ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ అఖిల్‌తో ‘సాక్షి’ ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్ర: రోజు ఎంతమంది రోగులు వస్తున్నారు.?

డాక్టర్: సుమారు 80 నుంచి 90 మంది వస్తున్నారు.

ప్ర: ఈ బస్తీ దవాఖానా పని వేళలు.?

డాక్టర్: సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 నుంచి 4గంటల వరకు, ఆదివారం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు తెరిచి ఉంటుంది.

ప్ర: ఎక్కువగా ఎలాంటి రోగులు వస్తుంటారు.?

డాక్టర్: ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడేవారు వస్తుంటారు. జలుబు, దగ్గు, గొంతునొప్పి వంటి వాటిపై ఎక్కువగా వస్తున్నారు.

ప్ర: మలేరియా, టైఫాయిడ్ రోగులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు.?

డాక్టర్: అనుమానం వస్తే మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు చేయిస్తున్నాం. ఉన్నట్లు తేలితే వారం రోజులకు సరిపడే మందులు ఇస్తున్నాం. తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తున్నాం.

ప్ర: డెంగీ రోగులకు ఎలాంటి సేవలు అందుతున్నాయి.

డాక్టర్: డెంగీ రోగులను ప్రత్యేకంగా చూస్తున్నాం. వీలైనంత వరకు ఇక్కడి చికిత్స ద్వారానే తగ్గిరచడానికి ప్రయత్నిస్తాం. ఒకవేళ సీరియస్ అనుకుంటే ముందే చెబుతాం.

ప్ర: ఇక్కడికి వచ్చిన రోగులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎలా అవగాహన కల్పిస్తున్నారు.?

డాక్టర్: వారంలో 2-3 సార్లు హెల్త్ మేళా(అవగాహన కార్యక్రమాలు) నిర్వహిస్తున్నాం. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలలు, పరిసరాల పరిశుభ్రత, ఎటువంటి ఆహారం తీసుకోవాలి అనే వాటిపై తెలియజేస్తున్నాం.

వీధి కుక్కల స్వైర విహారం

- మహిళను కరిచిన కుక్కలు
- కుక్కల బెడద తగ్గించాలని వినతి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలో మరోసారి వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. మంగళవారం ఉదయం ఉమామహేశ్వర కాలనీకి చెందిన లత(25) పనినిమిత్తం నడుచుకుంటూ వస్తుండగా సాయిబాబా ఆలయం వద్ద పది కుక్కలు ఆమెపై దాడి చేసి కరిచాయి. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు శివాజీ రాజు ఆమెకు స్థానికంగా ఉన్న ఆపిల్ క్లినిక్‌లో చికిత్స చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూడు రోజుల క్రితం ట్యూషన్‌కు వెళ్లి వస్తున్న 3వ తరగతి విద్యార్థిని రోషిణిపై కుక్కలు దాడి చేశాయని తెలిపారు. గత ఆరు నెలల వ్యవధిలో 85 మందికి పైగా కాలనీ వాసులు కుక్క కాటు బారిన పడ్డారన్నారు. ఈ విషయమై వార్తా కథనాలు రావడంతో మున్సిపల్ అధికారులు హడావుడి చేసి బ్లూక్రాస్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని, కుక్కలకు కు.ని. ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారన్నారు. అయితే అప్పట్లో 15 రోజులు హడావుడి చేసిన అధికారులు ఆపై కుక్కలను యథావిధిగా వదిలేశారన్నారు. దీంతో మళ్లీ కాలనీవాసులపై దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. అప్పటికైనా అధికారుల కుక్కల బెడద నివారణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని శివాజీ రాజు డిమాండ్ చేశారు.



కాలిపై గాయమైన దృశ్యం



గాయపడిన లతకు చికిత్స అందిస్తున్న దృశ్యం